# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు






ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 07  సంచిక : 15  మంగళవారం  08 - 09 - 2026  పేజిలు : 04  వెల రూ. 2


## అసభ్యకర భాషను వాడిన
# సభ్యుడిని డిస్మిస్ చేయాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదన్న సీఎం
- ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదని ఆవేదన
- తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం
- ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం
- స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్ :**

స్వతంత్ర భారతంలో సభాపతికి ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదని, ఇలాంటి భాష వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండించే అంశంపై సభలో చర్చ జరిగింది. తాను అన్ని సభలను చూశానని, కానీ ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అసభ్యకర భాషను వాడిన సభ్యుడి చేత కేసీఆర్ రాజీనామా చేయించాలని సీఎం డిమాండ్ చేశారు.వాయిదా అనంతరం శాసనసభ ప్రారంభమైన తరువాత స్పీకర్‌కు అవమానం జరిగిందని, ఆ అంశంపై చర్చ - మిగతా 2 లో

# ఇది దుశ్శాసన సభ...




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?
- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ



## ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవద్దు

- పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు
- అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు
- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన

**హైదరాబాద్ :**

తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర - మిగతా 2 లో

## అణు సామర్థ్యంతో ఉత్తర కొరియా 'కాంగ్ కోన్' నౌక

- రంగంలోకి దించిన ఉత్తర కొరియా!
- 'కాంగ్ కోన్' డిస్ట్రాయర్‌ను ప్రారంభించిన ఉత్తర కొరియా
- ఇది తమ అణు ప్రతిచర్య వ్యవస్థలో భాగమని ప్రకటించిన కిమ్
- నావికాదళాన్ని అణుశక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టీకరణ
- కుటుంబంతో కలిసి నౌకా ప్రారంభోత్సవంలో పాల్గొన్న కిమ్



**ఢిల్లీ :**

ఉత్తర కొరియా తన నావికాదళాన్ని ఆధునికీకరించే ప్రణాళికల్లో భాగంగా మరో కీలక ముందడుగు వేసింది. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో నిర్మించిన 'కాంగ్ కోన్' అనే కొత్త డిస్ట్రాయర్ (విధ్వంసక నౌక)ను - మిగతా 2 లో

## హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత
# భగ్గుమన్న చమురు ధరలు

- యూఎస్-ఇరాన్ నౌకలపై దాడులతో పెరిగిన ఆయిల్ ధరలు
- హర్మూజ్ జలసంధిలో భారీగా తగ్గిన నౌకల రాకపోకలు
- 97 డాలర్లకు చేరువలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర
- చమురు సరఫరా అంతరాయాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన



**ఢిల్లీ :**

పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, ఇరాన్ - మిగతా 2 లో




## తెలంగాణలో 'ఎస్ఐఆర్'
# గడువు పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ - మిగతా 2 లో

## మంగళగిరిలో కనిపించిన
# అరుదైన 'పునుగుపిల్లి'




- మంగళగిరి పానకాల స్వామి కొండపై పునుగుపిల్లి ప్రత్యక్షం
- తిరుమల శ్రీవారికి శుక్రవారం అభిషేకంలో దీని తైలం వినియోగం
- శరీర గ్రంథుల నుంచి వచ్చే ద్రవంతో పవిత్ర తైలం తయారీ
- అంతరించిపోతున్న జాతిగా వన్యప్రాణి చట్టం కింద సంరక్షణ
- టీటీడీ ఆధ్వర్యంలో జూపార్క్‌లో ప్రత్యేకంగా వీటి పెంపకం

# గ్రామీణ యువతకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు అభినందనీయం


- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం
- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం



**నెల్లూరు**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు.అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని - మిగతా 2 లో

## ప్రజానాడి




# స్థానిక సమరానికి టీడీపీ సై




- 28 జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించిన అధిష్ఠానం
- అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకు బదులు సీనియర్లకు అప్పగింత
- మిత్రపక్షాలతో సమన్వయం, ప్రచారంపై ఇన్‌ఛార్జ్‌లకు కీలక బాధ్యతలు
- ఫలితాల్లో తేడా వస్తే ఒప్పుకోనని కుప్పం నేతలకు చంద్రబాబు హెచ్చరిక

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సర్వసన్నద్ధమవుతోంది. ఈ దిశగా ఎన్నికల కసరత్తును వేగవంతం చేస్తూ, రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈసారి సరికొత్త వ్యూహాన్ని అనుసరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. - మిగతా 2 లో

## ప్రతి ఎకరాకు
# సాగునీరే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి :**

రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల - మిగతా 2 లో

ప్రజా మంటలు

మంగళవారం 08 - 09 - 2026

# ఈ పదవి మహిళలకు, ముఖ్యంగా బీసీ మహిళలకు లభించిన గౌరవం

## బాధ్యతగా ప్రజాసేవ చేస్తా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 :** రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్‌గా, క్యాబినెట్ మంత్రి హోదాలో శ్రీమతి గద్వాల విజయలక్ష్మి సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు.ప్రజాభవన్‌కు చేరుకున్న విజయలక్ష్మికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి, వేద మంత్రోచ్చారణల మధ్య అధికారిక ఫైల్‌పై సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీఎం ప్రజావాణి హాల్‌ను సందర్శించి, ప్రజావాణి కార్యక్రమం అమలవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కానీ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ పదవిలో ఇప్పటివరకు ఒక మహిళకు అవకాశం లభించలేదన్నారు. తొలిసారిగా ఒక మహిళకు ఈ బాధ్యత అప్పగించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు."ఈ అవకాశం నాకు వ్యక్తిగతంగా లభించిన గౌరవంగా మాత్రమే చూడటం లేదు. రాష్ట్రంలోని మహిళలకు, ముఖ్యంగా బీసీ మహిళలకు లభించిన గుర్తింపుగా, ప్రోత్సాహంగా భావిస్తున్నాను. పరిపాలనలో, నిర్ణయాలు తీసుకునే స్థాయిలో మహిళలకు మరిన్ని అవకాశాలు రావాలనే బలమైన సందేశాన్ని ఈ నియామకం ఇస్తోంది" అని ఆమె అన్నారు.రాష్ట్రంలోని మూడు కీలక పదవుల్లో మహిళలకు, ముఖ్యంగా బీసీ మహిళలకు అవకాశం కల్పించడం మహిళా సాధికారత, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని విజయలక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. తెలంగాణ సమగ్ర, సమతుల్య అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించేందుకు నా వంతు కృషి చేస్తాను. ఈ పదవిని కేవలం గౌరవంగా కాకుండా గురుతర బాధ్యతగా భావించి ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తాను" అని విజయలక్ష్మి తెలిపారు.పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కే. కేశవరావు, వి. హనుమంతరావు, మహ్మద్ అలీ షబ్బీర్, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, డాక్టర్ రోహిన్ రెడ్డి, మధు యాస్కి గౌడ్, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, పీ. అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కే. విద్యాసాగర్ తదితరులు విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు..

# ధర్మపురి ఉగ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి దాదాపు రూ.200 కోట్ల తో అభివృద్ధి

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**గొల్లపల్లి సెప్టెంబర్ 07 ప్రజా మంటలు** : ధర్మపురి శ్రీ ఉగ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.117 కోట్లు మంజూరు చేసిందని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి మేరకు మరో రూ.80 కోట్లు కూడా మంజూరు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు రూ.200 కోట్లతో ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు.ధర్మపురిలోని లక్ష్మీనరసింహ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం సందర్భంగా ఈ రోజు ధర్మపురి కి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రేపటి నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ధర్మపురికి రావడంలో సుమారు ఐదు గంటలు ఆలస్యమైందని, అయినప్పటికీ ప్రజలు, కార్యకర్తలు ఎంతో ప్రేమాభిమానాలతో తనకు స్వాగతం పలకడం సంతోషంగా ఉందన్నారు. ఆలస్యంగా వచ్చినందుకు క్షమాపణలు చెబుతూ, ప్రజలు చూపిన ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు.శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ప్రాధాన్యత, ధర్మపురి క్షేత్ర వైభవం అందరికీ తెలుసునని అన్నారు. గతంలో పలువురు నాయకులు ఆలయ అభివృద్ధిపై ఎన్నో హామీలు ఇచ్చినా అవి అమలుకు నోచుకోలేదన్నారు. ప్రజల ప్రభుత్వం ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ.117 కోట్లు మంజూరు చేసిందని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరిన మేరకు మరో రూ.80 కోట్లు కూడా మంజూరు చేస్తామని ప్రకటించారు.దాదాపు రూ.200 కోట్లతో ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని, క్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యాలు, ఆలయ వైభవం, మౌలిక వసతులను మెరుగుపరుస్తామని చెప్పారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని, ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.గత పదేళ్లలో ప్రజలు స్వేచ్ఛ లేకుండా భయంతో జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఉప ముఖ్యమంత్రి విమర్శించారు. ఒక కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని, తాను ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు అనేక అవమానాలు ఎదుర్కొన్నానని గుర్తుచేశారు.ప్రజల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహించిన ప్రజల మార్చ్, పాదయాత్రలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తనతో కలిసి పాల్గొన్నారని గుర్తు చేశారు.రాష్ట్రంలో ఒక్కో స్కూలుకు 200 కోట్ల నిధులతో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేశామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు.53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని తెలిపారు. ప్రతి రేషన్ కార్డు దారుడికి సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు.కులం, మతంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ భీమా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఈ పథకం త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు.రైతుల రుణమాఫీ కింద 25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్ల మేర ప్రయోజనం కల్పించామని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించామని చెప్పారు. రూ.లక్ష కోట్ల విలువైన పంటలను కొనుగోలు చేశామని, రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. సన్నరకం వరి సాగును ప్రోత్సహిం చేందుకు రూ 500/- బోనస్ అందిస్తున్నామని పేర్కొ న్నారు.రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కేవలం ధర్మపురిలో మాత్రమే విద్యుత్ స్తంభాల మార్పిడి కోసం రూ.6 కోట్లు మంజూరు చేశామని ఉప ముఖ్యమంత్రి తెలిపారుసాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులతోనే తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టానని అన్నారు. స్వామివారి ఆశీస్సులతో ధర్మపురి అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ చారిత్రక కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు.గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధర్మపురిలో యాగాలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి రూ.500 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చినా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం గోదావరి పుష్కరాల సందర్భంగా రూ.117 కోట్లు మంజూరు చేసిందని



తెలిపారు.ధర్మపురి అభివృద్ధికి ప్రభుత్వ సహకారం మరింత అవసరమని మంత్రి కోరారు. అక్కపల్లి లిఫ్ట్ ఇరిగేషన్, పాతిపాక రిజర్వాయర్, రొల్లవాగు ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.జగిత్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని కొనియాడారు. అప్పటి ప్రభుత్వం ఇచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల సమస్యలను శాసనసభలో బలంగా ప్రస్తావించారని తెలిపారు.నేడు ఉప ముఖ్యమంత్రిగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేయడం ఈ క్షేత్ర చరిత్రలో గొప్ప ఘట్టమని అన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి ధర్మపురి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం తెలంగాణలోని ప్రసిద్ధ నవనరసింహ క్షేత్రాల్లో ఒకటని, గోదావరి నది దక్షిణవాహినిగా ప్రవహించడంతో 'దక్షిణకాశీ', 'తీర్థరాజం', 'హరి హర క్షేత్రం'గా ప్రసిద్ధి చెందిందని తెలిపారు.వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని భక్తుల పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా విస్తరించనున్నారని, మరో వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ స్తపతుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగ లక్ష్మీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ దినేష్ ఇతర సీనియర్ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

## రూ 200 కోట్లతో దివ్యక్షేత్ర అభివృద్ధి

## భక్తులకు మరింత మెరుగైన వసతులు

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**జగిత్యాల జిల్లా ప్రతినిధి / ధర్మపురి ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 7 :** శతాబ్దాల చరిత్ర, విశిష్ట ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి (ఉగ్ర నరసింహ స్వామి) దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఆలయ పునర్నిర్మాణ పనులకు శుభ ముహూర్తాన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, విద్యుత్ శాఖ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో కలిసి ఘనంగా భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యక్షేత్రాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఈ ఆలయ పునర్నిర్మాణం కోసం దాదాపు రూ.200 కోట్లను కేటాయించింది.

**ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ...**

తెలంగాణలోని చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రాలను అభివృద్ధి చేసి వాటి వైభవాన్ని పునరుద్ధరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయాల అభివృద్ధితో



పాటు మౌలిక వసతులను మెరుగుపరుస్తామని తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి రూ.200 కోట్లను కేటాయించడం ద్వారా ఈ క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుందని పేర్కొన్నారు.రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.1,000 కోట్లను కేటాయించిందని ముఖ్యమంత్రి తెలిపారు. భక్తులు, యాత్రికులకు సౌకర్యవంతమైన, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేలా అభివృద్ధి పనులను చేపడుతున్నామని వెల్లడించారు.

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ....**

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ పునర్నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని అన్నారు. స్థానిక ప్రజల అభ్యర్థన, భక్తుల ఆకాంక్షలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు.ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన అనంతరం భక్తులకు మరింత మెరుగైన దర్శన సౌకర్యాలు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ దివ్యక్షేత్రాన్ని తెలంగాణలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ....**

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపడతామని తెలిపారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.భూమి పూజా కార్యక్రమం నిర్ణీత ముహూర్త సమయంలో వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

## పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

## ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 62

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) సెప్టెంబర్ 07 :** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ...**

జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు



అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరెట్ లో ఏర్పాటు చేసిన 41 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల నేపథ్యంలో 25.08.2026 నుండి 08.09.2026 వరకు నిర్వహిస్తున్న క్యాంపులో జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్ లు కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) బిఎస్ లత, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి రాజ గౌడ్, డిఆర్ఓ కె. వై ప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.ం

# చివరి శ్రావణ సోమవారం సందర్భంగా వేములవాడ భీమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ




**వెల్గటూర్ సెప్టెంబర్ 7 ( ప్రజా మంటలు ) :** శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో వేములవాడ భీమేశ్వర ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరగా, ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

# ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అపర్ణకు సత్కారం




**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 07 (ప్రజా మంటలు) :** ముల్కనూర్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు కొండ పాముల అపర్ణ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. హనుమకొండ అన్-ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆమెకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. హడుప్సా జిల్లా అధ్యక్షుడు బుచ్చిబాబు, జనరల్ సెక్రటరీ సంతోష్ రెడ్డి, ట్రెజరర్ దేవరుప్పుల శంకర్, ముఖ్య సలహాదారు వర్ధమాన్ జనార్ధన్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. విద్యాబోధనలో ఆమె కనబరుస్తున్న ప్రతిభకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కడం పట్ల పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ కాశిరెడ్డి ఆదిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అపర్ణకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి బీఆర్ఎస్





**జగిత్యాల, సెప్టెంబర్ ,07 ( ప్రజా మంటలు) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగిత్యాల కలెక్టరేట్‌లో ప్రజావాణికి వినతిపత్రం సమర్పించి, అనంతరం మెరుపు ధర్నా నిర్వహించారు.బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లా డుతూ.. మహాలక్ష్మి పథకం, వృద్ధులు, బీడీ కార్మికుల పెన్షన్లు సహా పలు హామీలు అమలు కాలేదని ఆరోపించారు. జగిత్యాలలో పెట్రోల్ బంకుల పేరుతో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, సుమారు రూ.100 కోట్ల విలువైన ఆస్తులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అక్రమ గుట్టల తవ్వకాలు, చెరువుల కబ్జాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, వారిని వెంటనే విడుదల చేసి శాసనసభకు అనుమతించాలని కోరారు.జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, ఉద్యోగాల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

# యువకుడిపై ఎక్సైజ్ సిబ్బంది దాడి ఆరోపణలు.. నివేదికలు కోరిన టీజీహెచ్ఆర్సీ




**హైదరాబాద్, సెప్టెంబర్ 07(ప్రజా మంటలు) :** నల్గొండ జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువకుడు ఆర్. మహేష్‌పై ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారన్న ఫిర్యాదును తెలంగాణ మానవ హక్కుల కమిషన్ విచారణకు స్వీకరించింది.ఆగస్టు 24న పదమటి తండా నుంచి దుగ్యాల వెళ్తున్న మహేష్‌ను ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని దేవరకొండ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించే సమయంలో కొట్టారని ఫిర్యాదులో ఆరోపించారు. దాడిలో తల, కాళ్లు, చెవులకు గాయాలై వినికిడి లోపం, నడవడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.కమిషన్ ఛైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో జరిగిన విచారణలో, నల్గొండ జిల్లా ఎస్పీతో పాటు కోటి ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి సూపరింటెండెంట్ నుంచి నివేదికలు కోరారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని, కుటుంబ సభ్యులను ఎలాంటి బెదిరింపులు లేదా వేధింపులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రెండు నివేదికలను సెప్టెంబర్ 24లోగా సమర్పించాలని టీజీహెచ్ఆర్సీ ఆదేశించింది.

# తాత మధుబాబు వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆగ్రహం



**కరీంనగర్, సెప్టెంబర్ 07 (ప్రజా మంటలు,) :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిరసన చేపట్టారు.కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దళితులను కించపరిచే వ్యాఖ్యలను సహించబోమని అన్నారు. తాత మధుబాబు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఇందిరా చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు తాత మధుబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా మంటలు

మంగళవారం 08 - 09 - 2026

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### కలెక్టరేట్ ఎదుట బీసీ--ఎస్సీ--ఎస్టీ జేపీసీ ధర్నా




**జగిత్యాల సెప్టెంబర్ 07 (ప్రజా మంటలు) :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం, బీసీ--ఎస్సీ--ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఫీజులు చెల్లించలేకపోవడంతో పలువురు విద్యార్థులకు కొన్ని కళాశాలలు సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీలు) ఇవ్వడం లేదని, దీంతో వారి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సరిపడా బడ్జెట్ కేటాయించి, భవిష్యత్తులో బకాయిలు పేరుకుపోకుండా పకడ్బందీగా నిధులు విడుదల చేసే విధానాన్ని రూపొందించాలని కోరారు. ఈ ధర్నాలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల సంజయ్ సామ్రాట్, బందెల మల్లయ్య, బొమ్మిడి నరేష్ కుమార్, గుంటి గంగారాం, హృషికేష్ తదితరులు పాల్గొన్నారు.

## కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకోండి

### జి.పి.లలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలి

### గ్రామ పంచాయతీ సమావేశాలకు విలేఖరులను అనుమతించాలి

### జిల్లా కలెక్టర్ ను కోరిన చుక్క గంగారెడ్డి




**బుగ్గారం ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 07 :** జగిత్యాల జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పాలక వర్గానికి కో - ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాలని తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ ను ప్రజావాణిలో కోరారు. ఆయన రెండు వేర్వేరు విజ్ఞాపన పత్రాలను జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజా వాణిలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత కు అందజేశారు. గ్రామ పంచాయతీ పాలక వర్గం సమావేశాలకు ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లను ఆహ్వానించి అనుమతించాలని కోరారు. అలాగే పాలక వర్గం సమావేశ మందిరాలతో పాటు గ్రామ సభల నిర్వహణ స్థలాల్లో కూడా వాయిస్ రికార్డ్ తో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చుక్క గంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా పాలక వర్గం సమావేశాలలో, గ్రామ సభలలో ప్రశ్నిస్తున్న వార్డ్ సభ్యులపై, ప్రజలపై జరుగుతున్న బెదిరింపులు, అఘాయిత్యాలను ఆయన విజ్ఞాపన పత్రం లో వివరించారు. గ్రామ సభలకు పోలీస్ బందోబస్తు కూడా నిర్వహించి అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ ను కోరారు. అలాగే బుగ్గారం మండల కేంద్రంలో జరిగిన ప్రజా వాణిలో కూడా నోడల్ అధికారి అయిన ఎంపిడివో సుమంత్ కు చుక్క గంగారెడ్డి మరో మూడు వేర్వేరు విజ్ఞాపన పత్రాలను అందజేశారు.

## శంకర్రావుపేటలో మార్కండేయ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన



**గొల్లపల్లి సెప్టెంబర్ 07 ప్రజా మంటలు :** మండలంలోని శంకర్రావు పేట గ్రామంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న మార్కండేయ మహర్షి దేవాలయానికి వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకు మొగరానికి నదీజలాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, వేదమంత్రోచ్ఛారణల మధ్య శంకు మొగరాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం మార్కండేయ మహర్షి హోమం నిర్వహించారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు అనుమల్ల నారాయణ కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వడ్లకొండ లక్ష్మీరాజం, కోశాధికారి ఎనగందుల జలంధర్, పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు గ్రామస్థులు, మండల పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు క్షమాపణ చెప్పాలి

### టీపీసీసీ కార్యదర్శి దాడిగ సందీప్‌రాజ్ డిమాండ్




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 07 (ప్రజా మంటలు) :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే క్షమాపణ చెప్పాలని టీపీసీసీ కార్యదర్శి దాడిగ సందీప్‌రాజ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ చిలకలగూడలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని తాతా మధు చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని, మహిళా లోకాన్ని తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సందీప్‌రాజ్ మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి హోదాలో ఉంటూ మహిళలను, నిర్దిష్ట సామాజిక వర్గాలను కించపరిచే రీతిలో మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. రాజకీయ లబ్ధి కోసం దిగజారి మాట్లాడిన తాతా మధు వ్యాఖ్యలను తెలంగాణలోని అన్ని రాజకీయ పక్షాలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఆయనను తక్షణమే ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని, చదువుకున్న వ్యక్తి అయి ఉండి ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయనకు ఓటు వేసి గెలిపించిన విద్యావంతులు సైతం ఈ ప్రవర్తన చూసి సిగ్గుపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, దళిత సమాజంతో పాటు మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలన పై అవగాహన సదస్సు



**గొల్లపల్లి సెప్టెంబర్ 07 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'మూఢనమ్మకాల నిర్మూలన పై సోమవారం అవగాహన సదస్సు' నిర్వహించారు. ముందుగా సాంఘిక, సమానత్వ సేవ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన చేతబడులు, శకునాలు వంటి మూఢనమ్మకాల వెనుక ఉన్న శాస్త్రీయ వాస్తవాలను, వాటి డొల్లతనాన్ని విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా వివరించారు. దేన్నీ గుడ్డిగా నమ్మకుండా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పచ్చివేపాకులపై నీళ్లతో మంటలు సృష్టించడం, విద్యార్థుల చేతులపై కిరోసిన్తో మంటలు లేపడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు తీయడం, కాళీ పేపర్లతో డబ్బులు తీయడం తదితర తదిత ప్రదర్శనను విద్యార్థులకు చేసి చూపించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో మంచి చెడులను విచక్షణతో గ్రహించడమే నిజమైన విద్య అన్నారు. అజ్ఞానం, భయమే మూఢనమ్మకాలకు మూలమని, రోగం వస్తే వైద్యులనే ఆశ్రయించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఇళ్లలో, గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉప్పులేటి నరేష్ ను, పాఠశాల ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్పీ ఆఫీస్ లో గ్రీవెన్స్ డే

### పజా ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 07 :** ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 16 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పిర్యాదులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### గాంధీనగర్ ఏసీపీ



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 07ం(ప్రజా మంటలు) :** రాబోయే వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముదిరాజ్ భవన్‌లో గణేష్ ఉత్సవ నిర్వాహకులతో ప్రత్యేక సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గాంధీనగర్ ఏసీపీ, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ పాల్గొని నిర్వాహకులకు పలు కీలక సూచనలు, భద్రతా మార్గదర్శకాలను వివరించారు. ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను కాపాడుతూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులు స్పష్టం చేశారు. మండపాల వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో వాలంటీర్లు కాపలా ఉండాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యం కలిగించే డీజేలకు అనుమతి లేదని, నిమజ్జన ఊరేగింపుల సమయంలో పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ టి. ఉషారాణి



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 07 ( ప్రజా మంటలు) :** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి కొత్త సూపరింటెండెంట్‌గా డాక్టర్ టి. ఉషారాణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు సోమవారం జీవో ఆర్‌టీ నం.355 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఉషారాణిని పరిపాలనా కారణాలతో గాంధీ ఆస్పత్రికి బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా, ఇప్పటివరకు గాంధీ ఆస్పత్రి అదనపు డీఎంఈగా వ్యవహరిస్తున్న డాక్టర్ సిహెచ్. రాజకుమారిని తక్షణమే ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ, హైదరాబాద్‌లోని వైద్య విద్య సంచాలకుల (డీఎంఈ) ఎదుట రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని వైద్య విద్య డైరెక్టర్‌కు ప్రభుత్వం సూచించింది.

## జగిత్యాల ధర్మపురి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం

### చెట్టును ఢీ కొన్న కారు - నుజ్జు నుజ్జు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 07:** జగిత్యాల జిల్లా కల్లెడ గ్రామం వద్ద సోమవారం సాయంత్రం ఓ కారు చెట్టును ఢీ కొట్టింది. కారు నుజ్జు నుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. అందులో ఒకరి పరిస్థితి అయోమయంగా ఉంది. తీవ్ర గాయాలైన వారిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బుగ్గారం పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ శంకర్ వారి సిబ్బందితో కలిసి కారు ప్రమాదానికి గురైన విషయాన్ని, సన్నివేశం ఫోటోలను, వీడియోలను ఉన్నతాధికారులకు చేరవేశారు. క్షతగాత్రుల బంధు మిత్రులకు, కుటుంబీకులకు సమాచారం





అందించారు. ప్రమాద స్థలం కల్లెడ గ్రామ శివారు, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉందని గుర్తించి జగిత్యాల రూరల్





పోలీసులకు కూడా సమాచారం చేరవేశారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రయాణికులకు గుడ్ న్యూస్ మెట్రో-ఆర్టీసీ ప్రయాణానికి ఉమ్మడి పాస్

### మెట్రో రైలులో ప్రయాణించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్

### ఓల్డ్ సిటీలో మెట్రో కారిడార్ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సూచన

### మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ వెంటనే ప్రవేశపెట్టాలని ఆదేశం

### మెట్రో రైల్, ఆర్టీసీ బస్సు ప్రయాణానికి ఉమ్మడి పాస్

హైదరాబాద్ నగరంలో మెట్రో రైల్, ఆర్టీసీ బస్సు ప్రయాణానికి ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా నెలవారీ, రోజువారీ పాస్ లను జారీ చేయడానికి ఏర్పాట్లు చేయాలని మెట్రో, ఆర్టీసీ అధికారులకు స్పష్టం చేశారు. బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇవాళ హెచ్ఎంఆర్ఎల్, టీజీఎస్ఆర్టీసీ, విద్యుత్ శాఖ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. విస్తరణ పనులు వేగవంతం చేయాలి హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు ఎండీ అజిత్ రెడ్డి, జాయింట్ ఎండీ శివేంద్ర ప్రతాప్ ఇప్పటి వరకు హైదరాబాద్ మెట్రో మొదటి, రెండవ దశల్లో చేపట్టిన వివిధ చర్యలను సీఎస్‌కు వివరించారు. పాతనగరంలో (ఓల్డ్ సిటీ) 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ కోసం రోడ్ విస్తరణ పనుల తాజా స్థితిగతులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. జనరల్ కన్సల్టెన్సీ నియామకానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుత స్థితిని అధికారులు వివరించారు. విస్తరణ పనులు వేగవంతం చేయాలని, త్వరితగతిన మెట్రో పనులు ప్రారంభం కావాలని సీఎస్ ఆదేశించారు. వెంటనే పాస్‌ల విధానాన్ని అమలు చేయాలి అనంతరం సీఎస్ సంజయ్ జాజు బేగంపేట్ నుంచి పారడైజ్ వరకు మెట్రో రైల్‌లో ప్రయాణించారు. ఆయనతో పాటు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి కూడా ప్రయాణం చేశారు. స్టేషన్లలో వాణిజ్య సముదాయాలను, పార్కింగ్ స్థలాలను అయన పరిశీలించి, వాటిని మరింత అభివృద్ధి చేయడానికి తగు సూచనలు చేశారు. ప్రయాణికులకు అందుతున్న సేవలను పరిశీలించారు. మెట్రో ఆర్టీసీ ప్రయాణీకులకు ఉమ్మడి పాస్ జారీ చేయడానికి సాంకేతికపరంగా సిద్ధంగా ఉన్నామని ఆదేశించిన తక్షణమే అమలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎల్ అండ్ టీ, హైదరాబాద్ మెట్రో రైల్, ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఉమ్మడి చార్జీలను త్వరితగతిన ఖరారు చేసి వెంటనే పాస్‌ల విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఎలివేటెడ్ కారిడార్లను పరిశీలించిన సీఎస్ ప్యారడైజ్ జంక్షన్ వద్ద ఉన్న ఎలివేటెడ్ కారిడార్, ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ఎస్‌హెచ్-1 (రాజీవ్ రహదారి)పై ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌లు అందుబాటులోకి వస్తే ప్యారడైజ్, సికింద్రాబాద్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల మధ్య రవాణా కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుందని సంజయ్ జాజు పేర్కొన్నారు. ఉత్తర హైదరాబాద్ ప్రాంతం నుంచి ఓఆర్ఆర్‌కు వేగవంతమైన అనుసంధానం ఏర్పడటంతో పాటు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ కారిడార్లు దోహదపడతాయన్నారు. ప్యారడైజ్ జంక్షన్ వద్ద ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్లను సీఎస్ పరిశీలించారు. సర్ఫరాజ్ అహ్మద్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రతిపాదిత కారిడార్ల అలైన్‌మెంట్, కనెక్టివిటీ, భూసేకరణ, మౌలిక వసతుల




అవసరాలను ఆయన పరిశీలించారు. కారిడార్‌లను సమగ్రంగా అభివృద్ధి చేయాలి ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్ వరకు ఎన్‌హెచ్-44పై, ప్యారడైజ్ నుంచి బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ మీదుగా ఓ.ఆర్.ఆర్ జంక్షన్ వరకు ఎస్‌హెచ్-1 (రాజీవ్ రహదారి)పై ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన ప్రణాళికలను అధికారులు సంజయ్ జాజుకు వివరించారు. ప్రత్యేకించి సికింద్రాబాద్--బొల్లారం--శామీర్‌పేట్ మార్గంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కారిడార్‌లను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సీఎస్ అధికారులకు స్పష్టం చేశారు. వేగంగా పరిష్కరించాలి ఈ కారిడార్లతో ప్యారడైజ్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, ప్రయాణ సమయాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రాజెక్టు అమలులో భూసేకరణ, యుటిలిటీల మార్పిడి, వివిధ శాఖల మధ్య సమన్వయం, అవసరమైన అనుమతులు తదితర అంశాలను వేగంగా పరిష్కరించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎలివేటెడ్ కారిడార్లతో పాటు మెట్రో రైలు, ప్రధాన రహదారులు, ఓఆర్ఆర్ మధ్య మెరుగైన అనుసంధానం ఏర్పడేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు.

## అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ బిగ్ ఫైట్.. కేటీఆర్ అరెస్టు, టీషర్ట్ విప్పేసిన హరీశ్ రావు

తెలంగాణ అసెంబ్లీ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం కాస్తా తోపులాటకు దారితీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ డ్రెస్‌లో అసెంబ్లీకి వచ్చారు. అయితే నల్ల దుస్తులతో లోపలికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు నేతలు పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలకు గాయాలైనట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పా? అని నిలదీశారు. ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నించకుండా తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. టీషర్టులు ధరించడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని కూడా బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరిస్తే తప్పు లేనప్పుడు తమకు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని నిలదీశారు. పిల్లలకు ఉద్యోగాలు అడిగితే విద్యార్థులపై పోలీసులు దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఇదేం పాలన అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. తాజా పరిణామాలతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com